# బహూపరాక్

ఆఫీసులో పనిముగించుకుని అలసటగా ఇంటికి చేరిన భాస్కరం, "మణీ! బాబిగాడెక్కడ?" అన్నాడు వస్తూనే కోపంగా.

"అదేమిటి? ఏమయిందసలు?" ఆందోళనగా అడిగింది.

"ముందు వాడెక్కడున్నాడో చెప్పు" అన్నాడు భార్య మాటకి సమాధానం చెప్పకుండా.

సాధారణంగా భాస్కరం ముఖంలో కోపం కనిపించదు. నెత్తిమీద పిడుగులు పడినా, కాళ్ళకింద భూమి కంపించినా ఆ ప్రభావాన్ని ముఖంలో కనిపించనివ్వని విధంగా ఉంటాడు. రోజూ అయిదుకల్లా స్కూలునుండి వచ్చేసే బాబిగాడు ఈ రోజు ఆరు దాటుతున్నా రాకపోవటానికీ, భర్త కలవరపడటానికీ ఏదో సంబంధం ఉండే ఉంటుందనిపించింది.

"నేనూ వాడికోసమే చూస్తున్నానండీ. అలా ప్రయివేటు మాస్టారింటికెళ్ళాండేమో?" అంది.

"ప్రయివేటుకెంటి నా బొంద? వాడసలు రెండ్రోజులుగా స్కూలుకే పోవటంలేదట?"

ఈసారి ఆందోళన చెందటం భార్య వంతయింది.

బాబిగాడు అలాంటివాడు కాదు. వాణ్ణి కాన్వెంటెలో చేర్పించిన దగ్గర్నుంచీ స్కూలుకి ఎగనామం పెట్టినరోజూ లేదు. ప్రతి సంవత్సరం ఫుల్‌ప్రజంట్ ఉన్నందుకు ప్రయిజులు కూడా తెచ్చుకున్నాడు. చదువులో కూడా వాడెప్పుడూ వెనకబడిలేదు. ఒకటినుండి మూడు రేంకుల్లోనే వస్తున్నాడు. అలాంటిది రెండు రోజులుగా స్కూలుకి ఎగనామం పెట్టి ఏంచేస్తున్నట్లు? ఎక్కడుంటున్నట్లు! ఏ పిల్లలతోనయినా ఆటల్లోపడి స్కూలుకెగేస్తున్నాడా? సినిమాలకెళ్తున్నాడా? అయినా వీడికి డబ్బులెక్కడివి? పైగా ఎప్పుడయినా ఎవరయినా డబ్బులిచ్చినా కిడ్డీ బ్యాంకులో వేసుకుంటాడేగానీ, ఖర్చుపెట్టే రకం కాదే?' అనుకుంది.

అలా ఆలోచిస్తుంటే..

రెండు రోజులక్రితం సంగతి గుర్తొచ్చింది. బాబిగాడు భోంచేస్తున్నాడు. నాడికిష్టమని గోంగూరపులుసు చేసింది. అప్పడాలు వేయించింది. అన్నం దగ్గర కూర్చున్నాడేగానీ రెండు ముద్దలయినా తినలేదు. సయించటంలేదని చెయ్యి కడిగేసుకున్నాడు. నుదిటిమీద చెయ్యేసి చూసింది. చల్లగానే ఉంది.

"ఏరా నాన్నా! గోంగూరపులుసు బాగాలేదా?" అడిగింది.

"బాగుంది" ముక్తసరిగా జవాబిచ్చాడు.

"మరి ఒంట్లో బాలేదా?"

"ఊహుం... అని లేచాడు. సరేలే అని ఊరుకుంది. ఆ మధ్యాహ్నం స్కూలుకి వెళ్తూ

"అమ్మా! కిడ్డీ బేంకులో నా డబ్బులెన్నున్నాయమ్మా?" అడిగాడు.

"ఏరా?"

"అబ్బే ఏంలేదు" అన్నాడు ఏదో చెప్పాలనుకున్నాడో ఏమో కొంగుపట్టుకుని తిరిగాడు. ఏం కావాలని ఎంతడిగినా బదులు చెప్పలేదు. ఆ విషయం గుర్తుకొచ్చింది. భర్తకి చెప్పాలని నోటి ముందువరకూ వచ్చింది. ఎందుకో చెప్పాలనిపించక ఆగిపోయింది.

"ఏమండీ, అసలేమయింది? ఇంతకీ వాడు స్కూలుకెళ్ళటంలేదని ఎవరు చెప్పారూ?' అడిగింది.

"వాడి ఫ్రెండ్ తోవలో కనిపించాడు. మా బాబీ ఏడంటే విషయం చెప్పాడు" అన్నాడు.

"అయ్యో! ఏమయిఉంటుంది? ఓ సారి ఎక్కడున్నాడో చూసి రండీ? నాకేంటో భయంగా ఉంది" అంది. అప్పుడే ఆమె కనుకొలుకుల్లో నీళ్ళు చిమ్ముకొస్తున్నాయి.

భాస్కరం చేసేది లేక సైకిలు తీసాడు. "ఓ స్కూలు పిల్లాణ్ణి గదిలో పెట్టి మరచిపోయి నైట్‌వాచరు తాళం వేయటం, ఆ పిల్లాడు చనిపోవటం ఆ మధ్య జరిగినట్టు విన్నాడు. స్కూలుకెళ్ళి తలుపులు తీయిద్దామనుకున్నాడు! కాని వీడసలు స్కూలుకే వెళ్ళలేదటగా?" అనుకున్నాడు. పార్కువేపు వెళ్లాడు. బస్సు కాంప్లెక్స్‌కి వెళ్లాడు రైల్వేస్టేషన్‌కి వెళ్ళాడు. ఎక్కడా కనిపించలేదు. ఎవర్నడిగినా చూళ్ళేదంటున్నారు. నేరుగా వాళ్ళ ప్రయివేటు మాస్టారు దగ్గర కెళ్ళాడు. భాస్కరాన్ని చూస్తూనే " రండి! రండి! ఇంకా మీకోసమే కబురు చేయాలనుకుంటున్నాను" అన్నాడాయన.

అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు. గుండెవేగంగా కొట్టుకుంటోంది. ముఖానికి చెమట పట్టేసింది బాగా. రుమాలుతో తుడుచుకున్నాడు.

కొంచెం మంచినీళ్ళు కావాలి సార్' అన్నాడు. మాస్టారు మంచినీళ్లు తెప్పించారు. మంచినీళ్ళు తాగి గ్లాసు కిందపెట్టాడు.

"అవునూ, మీ అబ్బాయి స్కూలుకీ రావటంలేదూ, ప్రయివేటుకీ రావటంలేదు. ఊరికి నీ వెళ్ళాడా?" అన్నాడాయన. ఎక్కుతున్న మేడ కూలిపోతున్నట్లనిపించింది భాస్కరానికి.

"అబ్బే..లేదండీ వాడు రోజూ బయలు దేరి స్కూలుకి వచ్చేస్తున్నాడు. ఇందాక వాడి ఫ్రెండ్ కలిసి చెప్పిందాకా, వాడు స్కూలుకి రావటంలేదనే విషయం తెలీదు. వాడీరోజు ఇంతవరకూ ఇంటికి చేరలేదు సార్. ఎక్కడున్నాడో? అసలు వాడెందుకిలా తయారయాడో అర్థం కావటం లేదండీ?" కంగారుగా అన్నాడు.

"మూడురోజుల క్రితం వాడిమీద గట్టిగా కేకలేశాను. మొన్న ఇరవయ్యో తారీఖుతో ఫీజు ఫైన్తో కట్టాల్సిన టైం కూడా అయిపోయింది. ఈ నెల ట్యూషన్ ఫీజూ తేలేదు. సాధారణంగా మీరు ఫస్టుకే పంపేస్తుంటారు.

ఫీజు కట్టలేదు. టైమయిపోయింది. మీ డాడీని తీసుకొస్తే కానీ స్కూలుకి రావద్దన్నాను. అసలవేళనుండీ స్కూలుకీ రాలేదు. పిల్లల్నడిగితే మాకు తెలీదన్నారు" చెప్పారు మాస్టారు.

"అదేంటి? ఫస్టునే పరీక్ష ఫీజూ, మీ ట్యూషన్ ఫీజూ ఇచ్చి పంపించాను. మీకిచ్చేశాడనే అనుకున్నాను'' అన్నాడు భాస్కరం.

"అబ్బే, అక్కడికీ అడిగాను. మీ నాన్నగారి కి చెప్పావా? అంటే ఉలుకూలేదు, పలుకూలేదు. అందుకే కోప్పడ్డాను. ఫైన్‌తో కూడా టైం అయిపోతోందని ఫీజు నేను కట్టేశానులెండి. మరాడబ్బులు ఏం చేసినట్టు? అందరిలాగా చిల్లరితిళ్లు తినే రకంకాదే! ఎక్కడయినా జార్చేసి ఇంట్లో చెప్పడానికి భయపడ్డాడేమో? అన్నారు మాస్టారు.

మాస్టారు ఫీజు కట్టేసినందుకు థాంక్సు చెప్పి, డబ్బులు తరువాత తెచ్చి ఇస్తానన్నాడు.

"తొందరేముందిలెండి?' అన్నారు మాస్టారు.

"వస్తానండీ వాడింకా ఇంటికి రాలేదు. వాడి స్నేహితులింటికిపోయి కనుక్కుంటాను'' అని లేచాడు.

"వాడిజాడ తెలిసేక కబురు చేయండి. కేకలేయకండి. నెమ్మదిగా విషయం తెలుసుకోండి' ' అన్నాడాయన.

గుండెలనిండా బరువుతో లేచాడు భాస్కరం.

'వీడు ఎందుకిలా తయారయ్యాడు? డబ్బులేం' చేశాడు? ఇప్పుడెక్కడున్నాడు?' ఒకదాని వెంట మరో సందేహం. భయం ఆందోళనతో ఇల్లు చేరుకున్నాడు.

"బాబు కనిపించాడా?''ఎదురుగా భార్య అడిగేసరికి గుమ్మంలో అడుగు పెట్టకుండానే ఆగిపోయాడు.

"ఇంటికింకా రాలేదా? ఎక్కడా కనిపించలేదు'' గొంతులో సన్నని ఒణుకు. ఏమండీ, నీకేదో భయంగా ఉందండీ! "మణీ. వీడు ఫీజూ కట్టలేదట'' అని మాస్టారు చెప్పిన విషయం అంతా వివరించాడు.

"ఏమండీ మీ బాబింకా ఇంటికి రాలేదా?'' పక్కింటామె అడిగింది. జవాబు ఆశించకుండా "పోలీసు రిపోర్టివ్వండి. ఈమధ్య పిల్లల్నెత్తుకుపోతున్నారు. కిడ్నీలు తీసి అమ్ముకుంటున్నారట. ఆమధ్య మా అక్కావాళ్ళ ఊళ్లో.. '' అంటూ చక్కని కథని అల్లిచెప్పింది. వాళ్ళబ్బాయి వెంటనే అందుకుని "అంకుల్, మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు ఎవరో ఒకాయన రిక్షాలో ఎక్కించుకుని బాబిని తీసుకెళ్ళటం చూశానండీ!'' అన్నాడు.

"చూశారా, చూశారా! త్వరగా వెళ్ళి రిపోర్టిచ్చిరండి'' అందామె.

మణి ఏడుపు లంకించుకుంది.

"అమ్మా! అన్నయ్య మధ్యాహ్నం భోంచేసి రెండుకి స్కూలు కెళ్ళాడన్నావ్‌గా'' అంది కూతురు.

"అవును సుమ్మీ'

అని ధైర్యపడింది. పక్కవాళ్ళపిల్లడు చెప్పింది నిజం కానందుకు.

భాస్కరర మళ్ళీ కొడుకును వెతకటానికి బయలుదేరాడు. ఎన్నోచోట్లకి వెళ్ళాడు. 'కొంపతీసి

ఏ అఘాయిత్యానికయినా పాల్పడలేదుకదా? మనసులో ఏ మూలనో అలా జరగదని అనిపించినా దాన్ని కప్పేసిన అధైర్యం అతన్ని భయపెడుతోంది. తిరిగి ఇంటికొచ్చాడు. ఇంటి దగ్గర అందరూ అతనికోసమే ఎదురుచూస్తుండటంతో పరిస్థితి అర్థమయిపోయింది. నీరు కారిపోయాడు.

రాత్రి ఎనిమిది దాటింది. బాబిగాడు 'ఎక్కడికోవెళ్ళాడు వస్తాడు' అన్న ఆశ తల్లిదండ్రులిద్దరిలో నశించింది. ఇక ఏదో దుర్వార్తవినాల్సి వస్తుంది. తప్పదు అనుకున్నారు.

అంతలో...

"అమ్మా! అన్న ఇంట్లో పెద్దమంచం కింద పడుకున్నాడే. మూలుగుతున్నాడు. పిలిస్తే పలకటంలేదు" అంది గబగబా పరుగెత్తు కుంటూ వచ్చిన కూతురు.

ఉన్న ఫళంగా వీధిలోంచి అందరూ ఇంట్లోకి పరుగుతీశారు. 'బాబీ బాబీ' పిలిచారు. బాబీ పలకలేదు. భాస్కరం మంచం కిందకు వంగి బాబిగాడి చెయ్యిపుచ్చుకుని బయటకు లాగాడు. కాల్చిన ఇనప వస్తువును ముట్టుకున్నట్టు షాకయ్యాడు.

"మణీ! బాబిగాడి ఒళ్ళేమిటిలా కాలిపోతోంది?" అన్నాడు. ఎంతో కోపంతో ఉన్నవాళ్ళు పెనుగాలికి వణికిన తీగెలా అయిపోయారు రిక్షా తీసుకొచ్చాడు. బాబిగాణ్ణో రిక్షాలో కూర్చోపెట్టి హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. బాబిగాడు కాలూ చెయ్యీ ఎగరవేస్తున్నాడు. ఎగిరెగిరి. పడుతున్నాడు. ఏమిటేమిటో కలవరిస్తున్నాడు. డాక్టరు తనిఖీచేశాడు. "చూడండి. పరిస్థితి ప్రమాదకరం కాదు. అయినా ఇక్కడ అడ్మిట్ చేయటం మంచిదనిపిస్తోంది." అన్నాడు.

ఆ రాత్రి హాస్పిటల్లో ఉన్నారు. రాత్రికి కూడా టెంపరేచరు తగ్గలేదు. అయిసు పెట్టారు. ఒంటిగంటప్పుడు డాక్టరు వచ్చి పరిస్థితి చూసి ఇంజక్షనిచ్చాడు. అప్పటికి కలవరింతలు తగ్గాయి. నిద్రపోయాడు. నాలుగయింది. టెంపరేచర్లో మార్పు కనిపించింది. తెల్లారి డాక్టరు వచ్చి మళ్ళీ చూశాడు జర్వం నూరుకి దిగింది.

"కుర్రాడు జడుసుకున్నాడు. ఏదో తీవ్రమైన ఒత్తిడికి గురయ్యాడు. ఏమయింది?" అడిగాడు.

జరిగిన సంగతి భాస్కరం వివరించాడు. పిల్లాడు మళ్ళీ హాయిగా తిరుగాడితే తిరపతి తీసుకొస్తామనుకున్నారు. మణి ఏడుస్తూనే ఉంది.

"మీరు అధైర్యపడకండమ్మా. మరింకేం? ప్రమాదం తప్పింది" అన్నాడు డాక్టరు.

ఆ మర్నాడు..

బాబిగాడు పూర్తిగా తేరుకున్నాడు. క్లాసు పిల్లలూ, మాస్టార్లూ, ఇరుగు పొరుగులవాళ్ళూ ఎవరెవరో వస్తూనే ఉన్నారు. బిస్కట్ పేకెట్లూ, ఆపిలుపళ్ళూ బత్తాయిలూ తెస్తూనే ఉన్నారు. ఏవేవో అడుగుతున్నారు. బాబిగాడు సిగ్గుపడిపోతున్నాడు. తండ్రితో అన్నాడు. "నాన్నారూ! నేనీ సంవత్సరం ఏడవతరగతి పరీక్ష వ్రాయడం కుదరదుకదా?" అన్నాడు.

"బాబూ! మాస్టారు నీ ఫీజు కట్టేశారు. దర్జాగా ఎగ్జాం వ్రాయొచ్చు" అన్నాడు భాస్కరం.

బాబిగాడు తండ్రి తలపెట్టుకుని బావురుమన్నాడు. కాసేపు తరువాత "బాబీ! నీకు డబ్బులిచ్చానుకదమ్మా, ఏం చేశావురా!" అడిగాడు భాస్కరం.

బాబిగాడి కళ్ళలో నీళ్లు.

వాటి వెనకాల జరిగిన కథ.

ఆరోజు మధ్యాహ్నం! భాస్కరం ఆఫీసు నుండి వచ్చాడు. లుంగీ కట్టుకొని భోజనానికి కూర్చోబోతుండగా పోస్టుమాన్ లెటరు ఇచ్చాడు. గబగబా చదివాడు. దానిలో విషయం విని చెమటల్లొక్కాడు. "మణీ! త్వరగా అన్నం పెట్టు. నేను వైజాగ్ వెళ్ళాలి. నాన్నగారికి హార్టెటాక్ వచ్చిందట" అన్నాడు కలవరపడుతూ.

"అయ్యో! నిన్ననే కదండీ ఆయనుత్తరం రాశారూ" అంది.

"నిజమే మణీ, హార్టెటాక్ రావటానికెంత సేపు? వెంటనే ఒక మూడువేలయినా కావాలి!' అన్నాడు.

"ఇప్పుడెలా అండీ? మొన్ననే పి.ఎఫ్.లోనూ పెట్టేశారు. పండుగ బట్టల అప్పు ఇంకా అలానే ఉంది. పోనీ ఇంకా ఎవరికీ బాకీలు తీర్చలేదుగా జీతం వచ్చాక ఆ రెండువేలూ అలా పట్టుకెళ్లండి. అట్నుంచి వచ్చాక మిగతా విషయాలు ఆలోచించుకోవచ్చు" అంది.

"నువ్వు చెప్పిందీ పాయింటే అయినా కనీసం మరో వెయ్యి ఉండాలి. అక్కడి పొజిషన్ ఎలా ఉందో? నిజానికి ఈ డబ్బులు చాలవు. వైజాగ్‌లో ట్రీట్‌మెంట్ అంటే కనీసం పదివేలు దాటుతుంది. తమ్ముడు మాత్రం ఎంత ఇవ్వగలడు! అట్నుంచి రాగానే మళ్ళీ డబ్బు ఎక్కడ సంపాయించాలో తెలీటంలేదు. కిరాణావాడికివ్వకపోతే వాడు సరుకులివ్వడు. ఈ వెధవ బ్రతుక్కి మరి సుఖం ఉండదు. ఒక దాని తరువాత మరొకటి ఫ్చ్! ఉండు. ఆ కాబూలీ దగ్గరకెళ్తాను ఓ అయిదు వేలడుగుతాను" అన్నాడు విచారంగా.

"ఏవండీ! అక్కడికొద్దండీ. ఈ పుసెల్తతాడు అమ్మేయండి. ఉన్నప్పుడు మళ్లీ చేయించుకోవచ్చు. వాడింటిమీద కొచ్చేస్తాడు. వీధిలో తలెత్తుకోలేం. సిగ్గుసిగ్గు" అంది.

భార్య మాటలూ నిజమనిపించాయి.

క్షణంలో పసుపుతాడు వేసుకుంది. భర్త చేతిలో పుస్తెలతాడు పెట్టింది. పదిహేనేళ్ల కాపురంలో అప్పో తులన్నర బంగారం అతను సంపాదించాడు.

ఇప్పుడు బంగారం కరిగిపోతోంది. అప్పే మిగుల్తోంది. మనసులో అనుకున్న మాటలు భార్యతో అన్నాడు.

బాబిగాడికీ పరిస్థితి అర్థమయింది. బాధగా తల్లినీ, తండ్రినీ చూస్తూండిపోయాడు. "బాబీ, స్కూలుకి టైమవలేదా?" అన్నాడు భాస్కరం.

"నాన్నగారూ! పరీక్ష ఫీజుకట్టాలి. రేపే ఆఖరిరోజు. మొన్నడిగితే ఇవాళిస్తానన్నారు. మాస్టారు ప్రయివేటుజీతం కూడా అడగమన్నారు". అన్నాడు బిక్కుబిక్కుమంటూ.

"రేపిస్తానని చెప్పు".

"రేపు మీరు రారేమో!"

"సరే ఇదిగో ఫీజుకట్టేసి మాస్టారికి ట్యూషన్ ఫీజు ఇచ్చే సెయ్యి" అపి ఏభయినోటిచ్చాడు. ఏభయినోటు జేబులో పెట్టుకుని స్కూలుకి బయలుదేరాడు.

బాబిగాడి మనసులో "డబ్బుకోసం తండ్రి ఎంత బాధపడుతున్నాడో అన్న బాధే! ఏదో సినిమాలో చూసినట్టు ఏ దేవతో కనిపించి తనకేం కావాలో కోరుకొమ్మంటే ఎంత బాగుణ్ణు?' ఠకీమని డబ్బే కోరుకొనేవాడుగా!

అసలు ఈ డబ్బుకోసం ఇంత ఇబ్బంది ఎందుకొస్తుంది?

ప్రభుత్వం ఎక్కువనోట్లు ప్రింటు చేయొచ్చుగా!

అలా కుదరదని చెప్పారుకదూ మాస్టారూ! పరిపరివిధాలుగా ఆలోచిస్తున్నాడు. నడుస్తున్నాడు. స్కూలుకి మూడు ఫర్లాంగుల దూరంలో రోడ్డుపక్కన గుమిగూడారు జనం. అక్కడికెళ్లాడు బాబిగాడు.

అక్కడ వాడు మూడు పేకముక్కలు పేరుస్తున్నాడు. వాడు తిరగేయకమునుపు ఎవరెవరో డబ్బులు కాస్తున్నారు. మూడు బొమ్మలు వచ్చాయి ముక్కలు తిరగేస్తే పెట్టిన డబ్బుకి రెట్టింపు వచ్చింది. బాబిగాడిలో ఏదో మెరిసింది. "ఇదిగో నాది పది"? అన్నాడు. వాళ్ళ డబ్బులు పెట్టిన దగ్గరే. వాళ్లంతా బాబిముఖంలోనికి చూశారు. వాడు అందరూ డబ్బులు పెట్టాడు. నలభై వచ్చింది. లేచిపోదామనుకున్నా పక్కవాళ్లు లేవనివ్వలేదు.

" ఏయ్ బాబూ! ఇదిగో ఇక్కడ పెట్టు డబ్బులన్నీ పెట్టేయ్. ఎంతుంది?" అన్నారు. బాబి డబ్బులు లెక్కచెప్పాడు. వాళ్లు చెప్పినట్టే మొత్తం కాసేశాడు. వాడు ముక్కలు తిరగేశాడు. బాబిగాడి ముఖం నల్లగా అయిపోయింది. డబ్బులన్నీ పోయాయి. గట్టిగా ఏడ్చేశాడు.

"ఏయ్, ఎందుకూ ఏడుపూ? మావీపోయాయి. ఇదిగో అయిదు పట్టుకెళ్లు. ఒరే! అన్నా. బేగి తీసెయి. పోలీసుమావియ్యొత్తండు" అన్నాడందులో ఒకడు. బాబిగాడి చేతిలో అయిదుపెట్టి, అందరూ తలో దిక్కుపారిపోయారు. వాళ్ళందరూ ఒకటేనని బాబిగాడికేం తెలుసు?

పొంగి వస్తోన్న దుఃఖం

ఆ దుఃఖంలో డబ్బుకోసం తండ్రి పడేబాధ! తను చేసిన వెధవ పని.

ఏడుస్తూ తిట్టుకుంటూ ముందుకు నడిచాడు. "రండి బాబూ! డబ్బు ఎవరిక్కావాలో రండి. ఒక్క రూపాయి మిమ్మల్ని లక్షాధికారులను చేస్తుంది. మీరు ఇల్లు కట్టుకోవచ్చు. ఫ్రీజ్‌లు, కలర్ టీ.వీలు కొనుక్కోవచ్చు. ఎన్నాళ్లండీ. ఎన్నాళ్లింకా డబ్బులేక ఇబ్బందులు పడతారు? రండి సార్. రండి. త్వరపడండి. ఈ సాయంకాలమే డ్రా" అని లాటరీ రిక్షా ఎదురుపడింది.

బాబిగాడు మరో ఆలోచనలేకుండా అయిదురూపాయలూ ఇచ్చి అయిదు టిక్కెట్లు తీసుకున్నాడు. వాడి మనసులో ఇప్పుడు బాధలేదు. భయంలేదు. దిగులులేదు. తెల్లారితే

లక్షాధికారి అయిపోతాం. నాన్నగారికి మరి డబ్బుకి ఇబ్బంది ఉండదు. అమ్మకి మళ్ళీ మెళ్ళోకి బంగారం నగలు చేయించొచ్చు. కలలు కన్నాడు. తెల్లారగానే చకచకా రోజాకంటే ముందుగా బయలుదేరిపోయాడు గొప్ప హుషారుగా.

సెంటల్లో లాటరీ టిక్కట్లమ్మే వాడిదగ్గరికెళ్లి నంబర్లు చూడమన్నాడు వాడు నంబర్లు చూసి టిక్కెట్లిచ్చేశాడు. "ఈ టిక్కట్టుంది. అయిదులక్షలు కావాలా?" అన్నాడు.

బాబిగాడి ముఖంలో కళలేదు. చేతిలో డబ్బులేదు.

ఆ తరువాత చాలాసార్లు లాటరీటిక్కట్లు కొంటూనే ఉన్నాడు ఎలాగో దేనికయినా తగుల్తుందేమోననే ఆశతో దేనికీ తగల్లేదు. అంతా మోసం అని తెలుసుకున్నాడు. పరీక్ష ఫీజుకట్టాల్సిన టైం దగ్గరయిపోతోంది. మాస్టారు రోజా తినేస్తున్నాడు. డాడీని తీసుకురమ్మంటున్నారు.

ఏం చేయాలో తెలీటంలేదు.

నిజం తెలిస్తే డాడీ చంపేస్తారు. ఎక్కడకయినా పారిపోదామంటే అమ్మో అమ్మ బతగ్గలదా? తను లేకుండా?

సమస్య వాణ్ణి పీడించింది. పిప్పిచేసింది. స్కూలుకెళ్తోన్న బాబికి తలబ్రద్దలయిపోతున్నట్ల నిపించింది. ఇంటికి తిరిగొచ్చేశాడు. మెల్లగా దగ్గరకు చేరేసిన తలుపు తోసుకుని లోనికి వచ్చాడు. తల్లి పడుకుంది. మంచం కిందకి దూరిపోయాడు.

బాబిగాడు చెప్పిన విషయాలన్నీ విని తల్లీ తండ్రీ బావురుమన్నారు వాణ్ణి గుండెలకందుముకున్నారు. అక్కడికి వచ్చి నిలబడిన డాక్టరుగారూ విన్నారు.

"భాస్కరంగారూ, మనం ఇంట్లో చాలా విషయాలు మాట్లాడేసుకుంటాం. అందులో పిల్లలు వినకూడనివి ఎన్నో ఉంటాయి. మనం మన సమస్యల గురించి బాధపడతామేగానీ, పిల్లలమీద వాటి ప్రభావం ఎంత ఉంటుందో గమనించం. అంతేకాదండీ, మనం పిల్లల్ని స్కూలుకి పంపేటప్పుడు ఎన్నో విషయాలు చెప్పాలి. లోకంలో అడుగడుగునా మోసమే. పెద్దాళ్లం మనమే షేర్లనీ, ఫాట్లనీ అవనీ, ఇవనీ ఎన్నో ప్రలోభాలకి గురౌతాం. పిల్లలకేం తెలుస్తుంది చెప్పండి. వీటిల్లో ఎంత మోసం ఉందో? అందుకే అప్పుడప్పుడూ వాళ్లని దగ్గర కూర్చోబెట్టి మనం జాగ్రత్తలు చెప్పాలి. ఏనీ హౌ, మీరదృష్టవంతులు. ఇక పిల్లాణ్ణి తీసుకెళ్ళొచ్చు" అన్నాడు డాక్టరు.

"థాంక్సండీ" అన్నారు ఆ దంపతులు.

"ఏం బాబూ! మరెప్పుడూ లాటరీలూ, అవి కట్టవుగా. బుద్ధిగా చదువుకుని, మంచి ఉద్యోగం సంపాయించి అప్పుడు నాన్న చేతిలో బోల్డు డబ్బు పెట్టు. అమ్మకి నగలు చేయించు. సరేనా?" అన్నాడు డాక్టర్ బాబిగాడి బుగ్గ గిల్లుతూ.

బాబిగాడు సిగ్గుతో తలదించుకున్నాడు.

(విపుల మాసపత్రిక నుండి)

* * * *